

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 198 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం, 18, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# రైతులకు.. అ'కాల' నష్టం!

## ధాన్యం కొనుగోలులో తీవ్ర నష్టం



**హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-**

ప్రభుత్వాలు రైతులపై చూపిస్తున్న ప్రేమ ఉత్తదేనా అంటూ డాక్టర్ బరిగెల శివ నిలదీశారు.దేశంలో వ్యవసాయానికి మొదటి ప్రాధాన్యతనిస్తున్న పంజాబ్ లాంటి రాష్ట్రాన్ని ముచ్చెమటలు పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం రైతు విరోధి ప్రభుత్వంగా నిలిచిపోగలదని హెచ్చరించారు.బిజెపి హయాంలో కేంద్ర ప్రభుత్వం అవలంబించిన రైతు నల్ల చట్టాల అమలును తెగించి కొట్లాడి సాధించుకున్న రైతులు ఢిల్లీ జంతర్మంతర్ దగ్గర సుమారు 800 రోజులపాటు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించిన సంఘటనలు మర్చిపోకూడదన్నారు.రైతులు పండిస్తున్న పంటలపై ఆయా ప్రభుత్వాలు వదంతులు పుట్టిస్తూ గోదాంల యాజమాన్యాలతో కుమ్మక్కై రైతులను అరిగోస పెట్టుకుంటున్నారని నిలదీశారు.వరి కోత పూర్తయిన రైతులందరూ ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసుకొని,వరికల్లాలలో ఆరబోసుకుని, ఎండగట్టి రైతు కొనుగోలు కేంద్రాల యజమాన్యాలకు సమాచారాలు ఇవ్వడమే కాకుండా పండించిన వారి ధాన్యం కొనుగోలు చేయాలని నానా విధాలుగా

- మిగతా 2లో..

- సన్న వడ్ల కొనుగోలు మొదలు కాలేదు?
- వేసవి పంటను కొనడానికి వెనుకడుతున్న ప్రభుత్వాలు
- కేంద్రం రైతుల నడ్డి విరుస్తుంది
- ప్రభుత్వాలు రైతులను మోసగిస్తున్నాయి
- కడుపు నిండా తిండి కోసం రైతులు పడుతున్న ప్రయాసను వృధా చేస్తున్నారు
- మే 4 లోపు వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలన్నారు, అమలు ఎక్కడ
- ఆంధ్రాలో మరీ దారుణం రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు
- వర్షాకాలం పంటలో వారి ధాన్యం పండించద్దని అప్పుడే ఆంక్షలు మొదలయ్యాయి
- రైతుల పంటలకు లాభం లేదు రైతుల జీవితాలకు భరోసా లేదు
- నకిలీ రైతు కొనుగోలు కేంద్రాలపై నమోదైన కేసుల విచారణ ఎక్కడ
- రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు ప్రజాసేవ ఎలా చేస్తాయి : డాక్టర్ బరిగెల శివ

## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

- ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది
- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు
- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

2



## రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి
- పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి
- సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు
- కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి



7

## ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభంలో ప్రపంచం


6

- ఆర్థికంగా వెనకబడ్డ దేశాలను ఆదుకోవాలి
- జి-7 సైదస్సులో ప్రధాని మోడీ వెల్లడి

## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

- రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ఐ బస్సు ప్రయాణం
- రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

7





## పట్టా భూమిలో పగరాజేస్తున్న సర్పంచ్

- సర్పంచ్ బాబు ఆగడాలు దినదినం మితిమీరిపోతున్నాయి
- పట్టాదారులపై దాడులు చేయిస్తున్న సర్పంచ్ బాబు
- 60 సంవత్సరాలు సాగుకాలంలో ఉన్న భూమిలో సర్పంచ్ ఫకర్ చూపిస్తున్నాడు
- ఏకంగా పోలీసుల పైకే దౌర్జన్యానికి దిగుతున్నాడు
- పలుమార్లు పట్టాదారులను భౌతికంగా కొట్టిస్తున్నాడు
- సాగు చేసుకుంటున్న పట్టా భూమి పైకి తన కుటుంబ సభ్యులను అనుచరులను పంపిస్తూ గొడవలు పెట్టిస్తున్నాడు
- తిర్మలాయపల్లి గ్రామ శివారులో సర్వేనెంబర్ 130/1 విస్తీర్ణం 3.19 గుంటలు బరిగెల కొమరయ్యకు చెందినది

7

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# రైతులకు అ"కాల" నష్టం

మొదటి పేజీ తరువాయి



ప్రాధేయపడుతూ వేడుకుంటున్నప్పటికిని రైతు కొనుగోలు కేంద్రాలు లాభాలను ఆశించి ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులను చెల్లించడం కోసం రైతులపై అధిక భారం పెడుతున్నారని రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను చెల్లించకుండా చాలామని కొనసాగిస్తూ రైతులు పండించిన పంటలో రైతులను మోసగిస్తూ, తరుగురూపంలో రైతులకు తీవ్రమైన అన్యాయం చేస్తూనే,ప్రభుత్వాలకు చెల్లించాల్సిన కొనుగోలు కేంద్రాల నష్టాలను పన్నులను రైతు పండించిన పంట నుండి రాబడుతూ రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నారు అని హెచ్చరించారు 2025 సంవత్సరంలో పోల్చుకుంటే 2026 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎన్ని లక్షలుయూనిట్లు,ఎన్ని కోట్ల టన్నులు,ఎన్ని లక్షల మెట్రిక్ క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారో అన్ని ప్రభుత్వాలు బహిరంగంగా శ్వేతపత్రం రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### వర్షాకాలం "వరి" ధాన్యంలో మొలకలు..

రైతులు పండించిన వేసవి పంటను కొనుగోలు చేసే క్రమంలో పలు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు దృష్ట్యా తడిసిన ధాన్యంతో సహా కొనుగోలు చేయాలని దేశ వ్యాప్తవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాలు రైతు మిల్లర్ల కొనుగోలు కేంద్రాల యజమానులకు పకడ్బందీగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ రైతుల పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయడానికి ముందుకు రాని రైతు కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వాల ఆదేశాలను దిక్కరించాయని స్పష్టంగా తేలిపోతుందన్నారు.మరోవైపు చాలా ప్రాంతాల్లో వర్షాలు చుట్టుముట్టి రైతులు పండించిన పంటను తీవ్రంగా నష్టం పాలు చేశాయని రైతులు పంట నష్ట భారాన్ని తట్టుకోలేక ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్నారని బాధపడ్డారు.రైతులు పండించిన పంటపై లాభాలు రాకపోయినా పర్వాలేదు గాని పండించిన వరి ధాన్యం నష్టం జరగకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి రైతులను సంతోష పరచాల్సిన ప్రభుత్వాలు ప్రతి రాష్ట్రంలో రైతును గోస పెడుతూ రైతును ఇబ్బంది పెడుతూ రైతు సంక్షేమాన్ని తీవ్రంగా దెబ్బ కొడుతున్నారని విమర్శించారు.ప్రతి రైతు సకాలంలో వారి ధాన్యం అమ్ముడుపోతే అమ్ముడుపోయిన ధాన్యానికి గాను కొనుగోలు కేంద్రాల నుండి వరి ధాన్యానికి రావాల్సిన ఆదాయాన్ని చేతికి తీసుకోవడానికి కావలసినంత సమయం పడుతున్నప్పటికీ పండించిన పంట మొదలుకొని రైతు గోదాములకు చేరవేసే వరకు, దాన్యం కొనుగోలుదారులు రైతులు పండించిన పంటను కొనే వరకు కొన్న పిదప రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేంతవరకు అన్ని విధాల రైతులు మానసిక క్షోభను అనుభవిస్తున్నారని బాహాటంగా చెప్పారు.రైతులకు విలువలు ఇవ్వని ప్రభుత్వాలు తక్షణం దిగిపోవాలని హెచ్చరించారు.రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తున్న ప్రభుత్వాల మొండి వైఖరి పూర్తిగా నశించాలని హెచ్చరించారు.ఆయా ప్రభుత్వాలు రైతు కొనుగోలు కేంద్రాలను పరీక్షించి,రైతు కొనుగోలు కేంద్రాల యాజమాన్యాలతో అన్ని విధాలుగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ రైతులను ఆదుకోవాలని రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదని రైతు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలు యజమానుదారు స్పష్టమైన ఆదేశాలు జారీచేస్తున్నప్పటికిని రైతులు పడుతున్న ఇబ్బందులు సమావేశాలు సమీక్షల వరకే పరిమితమైపోతూ రైతన్నలను తీవ్రమైన కష్టంలో నుండి వెలికితీయడానికి ప్రభుత్వాలకే కాదు కదా ధాన్యం కొనుగోలు కేంద్రాల యాజమాన్యాల కూడా మనసొప్పడం లేదని నిలదీశారు.

### కొనుగోలు కేంద్రాలపై క్రిమినల్ కేసులు..

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ ప్రభుత్వాలకు ప్రభుత్వాల ఆధీనంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు లెక్కలతో కూడిన సమాచారాన్ని ఆధారాలను చూపించాల్సిన దాన్యం కొనుగోలు కేంద్రాల యజమాన్యాలు,ప్రతి రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రైతు కొనుగోలు కేంద్రాలు లేకపోయినప్పటికిని కొనుగోలు కేంద్రాలు ఉన్నట్లుగా రికార్డులు సృష్టించి ప్రభుత్వ అధికారులతో కుమ్మక్కై రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేశామని లెక్కలు చూపిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొట్టిన సందర్భాలు లెక్కలేనన్ని కలవని అలాంటి కొనుగోలు కేంద్రాల రికార్డులను మౌఖిక మోక విచారణలను క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వాలు,సైబర్ క్రైమ్స్ ,టాస్క్ ఫోర్స్,విజిలెన్స్,సివిల్ సప్లై లాంటి శాఖలతో విచారణ చేపట్టి ఏ ఏ రైతుల వద్ద వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పత్రాలను సృష్టించారు కొనుగోలు కేంద్రాలు రికార్డులను పుట్టించారో వాటన్నిటిని పరిగణలోకి తీసుకొని వేలకు వేల పైగా రికార్డులు లేనప్పటికి కొనుగోలు కేంద్రాలు లేనపుటికి ఉన్నట్టుగా సృష్టించుకొని పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడిన నకిలీ ధాన్యం కొనుగోలు కేంద్రాల యాజమాన్యాలపై లెక్కలేనన్ని కేసులు నమోదయ్యాయని అయినప్పటికీ కఠిమైన చర్యలు తీసుకోవడంలో మాత్రం అన్ని ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయని విమర్శించారు.పలు రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారిన కేసులు మారవు మాఫీ కావన్న సంగతి ప్రభుత్వాలకు తెలిసినప్పటికీ నేటికీ కేసుల విచారణ కేసుల పురోగతి ఎక్కడికక్కడే నిలిచిపోయిందని అలాంటి క్రిమినల్ కేసులు నమోదు చేయబడిన ధాన్యం కొనుగోలు కేంద్రాల యజమాన్యాలు ప్రస్తుతం రైతులను క్షేత్రస్థాయిలో మోసగిస్తున్నారని ఇప్పటి ప్రభుత్వాలలో కూడా ప్రతి రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పదేపదే ఉత్పన్నం అవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హెచ్చరించారు.నిజమైన రైతులు పండించిన పంటకు లాభం చేయలేని ప్రభుత్వాలు నిజమైన పంట పండించిన రైతులకు జరగాల్సిన లాభాన్ని నకిలీ ధాన్యం కొనుగోలు కేంద్రాల యజమాన్యాల రూపంలో నకిలీ రైతులకు చెల్లించినట్లుగా వేల కేసులు ప్రతి రాష్ట్రంలో మూలుగుతున్నాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో నైతే విపరీతమైన దందా నడిచిందని వాటిని ఇప్పటికీ అదే స్థాయిలో కొనసాగించడం రైతులను విపరీతంగా మోసగించడమే అన్నారు.ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కొనుగోలు కేంద్రాలతో పాటు ప్రైవేట్ కొనుగోలు కేంద్రాలకుపై ఎప్పటికప్పుడు క్లియరెన్స్ ఆధారాలను పరిశీలిస్తూ ప్రభుత్వానికి అన్ని రకాలుగా పన్నులు చెల్లిస్తూ రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాత్రమే కొనసాగించి రైతులకు మేలు చేయాల్సిన ప్రభుత్వాలు ప్రతి సంవత్సరంలో రైతులు పండిస్తున్న రెండు రకాల పంటలకు సరైన సమయంలో దాన్యం కొనుగోలు చేయాలేని నష్టం ఒకటైతే, సరైన సమయంలో దాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు చెల్లించాల్సిన ఆదాయపు సొమ్మును ఇవ్వకుండా కొనుగోలు కేంద్రాల చుట్టూ తిప్పుకుంటూ అధికారులతో సయోధ్య ఏర్పరచుకొని రైతులను మానసికంగా శారీరకంగా ఆర్థికంగా తీవ్రమైన నష్టాన్ని వాటిళ్ళ చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వాల నుండి సకాలంలో రావలసిన రైతు పంట నష్ట పరిహారాలు,అన్ని ప్రభుత్వాలు ప్రభుత్వ ఆధీనంలో రైతులకు కల్పిస్తున్న ఆర్థిక భరోసాలు సంవత్సరాల కాలం పాటుగా చెల్లింపు లేకుండా ఉండడంతో రైతుల మనోవేదనకు కారకలవుతున్నారని ప్రత్యక్షంగా హెచ్చరించారు.రైతు పండించిన పంటతో దేశానికి మొత్తం రేషన్ బియ్యం పంచుతున్న ప్రభుత్వాలు రైతుకు నూతన స్థాయిలో జరుగుతున్న నష్టాన్ని మాత్రం పుద్చలేకపోతున్నారని పైగా రైతులపై వివక్షత చూపుతున్నారని చిన్న కారు రైతులకు చిన్నన్యాయం మధ్యతరగతి రైతులకు మరొక న్యాయం సంపన్న రైతులకు సకాలంలో సౌకర్యాలు కల్పిస్తూ రైతులకు చేస్తున్న తీవ్రమైన నష్టాన్ని అన్యాయాన్ని సమాజాలకు తెలియకుండా జాగ్రత్త పడుతుండడం ప్రభుత్వాల మూర్ఖత్వం అన్నారు.రైతుల పడుతున్న మనోవేదన ప్రభుత్వాలు అనుభవించక తప్పదని హెచ్చరించారు.రైతు కొనుగోలు కేంద్రాల దగ్గర జరుగుతున్న దాన్యం కొనుగోలు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ కొనుగోలు కేంద్రాల దగ్గర రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని తీవ్రంగా పసిగట్టాల్సిన ప్రజాప్రతినిధులు రైతు కొనుగోలు కేంద్రాల వైపు మనసుపెట్టిన దాఖలాలు లేకుండా పోతున్నాయని అలాంటి ప్రజా ప్రతినిధులు అలాంటి నాయకులు ప్రజలకు సేవ చేస్తున్నాం ప్రజలకు మేలు చేస్తున్నాం రైతులను ఆదుకుంటున్నామని దొంగ మాటలు మాట్లాడడం తప్ప రైతు సంక్షేమానికి రైతు సమాజానికి తీరని మోసం చేసినట్టేనున్నారు.రైతులకు లాభాలను చేకూర్చాలని సద్భావన సదాలోచన సకాలంలో కలగకపోవడం రైతులపై మోసపూరిత విధానాలను అవలంబిస్తున్నారన్నది పచ్చి నిజం అన్నారు.

## అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. కుటుంబానికి భరోసా**
**వైద్య ఖర్చులకు రూ. లక్ష సాయం..**
**నిర్మాత బండ్ల గణేష్ నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం**



**హన్మకొండ, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

జన్యుపరమైన అరుదైన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న తన అభిమాని నిరంజన్‌ను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బుధవారం హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. అభిమాని కోరికను గౌరవిస్తూ స్వయంగా ఇంటికి చేరుకున్న పవన్ కళ్యాణ్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్య వివరాలను తెలుసుకున్న పవన్ కళ్యాణ్, అతని తల్లిదండ్రులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. చికిత్స కోసం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నిరంజన్ వైద్య ఖర్చుల నిమిత్తం పవన్ కళ్యాణ్ రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేష్ స్పందించి నిరంజన్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. దీంతో కుటుంబ సభ్యులు పవన్ కళ్యాణ్, బండ్ల గణేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ రాకతో నిరంజన్ కుటుంబంలో ఆనందం నెలకొనగా, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అభిమానిపై పవన్ కళ్యాణ్ చూపిన ఆప్యాయత, మానవతా దృక్పథాన్ని స్థానికులు, అభిమానులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులకు కారుపై కూలిన ప్రహారీగోడ

**కారులోనే ఇద్దరు వ్యక్తులు దుర్మరణం**

**మహబూబ్‌నగర్,జూన్17(జై భీమ్ న్యూస్):**

జిల్లాలోని దేవరకద్రలో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించి ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. కారుపై ప్రహరీగోడ కూలడంతో జగన్నాథరెడ్డి, సంతోష్ మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి, బల్సుపల్లి, దేవరకద్ర, పెద్దగోప్లాపూర్ గ్రామాల్లో భారత్‌మాల రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం తిరుపతి నుంచి జగన్నాథరెడ్డి (40), పశ్చిమబెంగాల్ నుంచి సంతోష్(35) వచ్చి కాంట్రాక్టర్ కింద పనిచేస్తున్నారు. జగన్నాథరెడ్డి అకౌంటెంట్‌గా, సంతోష్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, వడగళ్ల వర్షం కురవడంతో పనిముగించుకొని అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు చేరుకున్నారు. భారీగా వర్షం కురుస్తుండటంతో ఇద్దరూ కారులోనే కూర్చొని ఉన్నారు. అదే సమయంలో భారీగా ఈదురుగాలులు వీయడంతో పక్కనే ఉన్న ప్రహరీ గోడ కూలి కారుపై పడింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. అందులో జగన్నాథరెడ్డి, సంతోష్ ఇరుక్కుపోయారు. గమనించిన స్థానికులు.. వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. మార్గంమధ్యలోనే వారు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఘటనాస్థలాన్ని స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

**ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది**
**ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం**
**సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు**
**అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు**
**కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం**
**ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్**
**స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**

**రంగారెడ్డి,జూన్17(జై భీమ్ న్యూస్):**

ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ ముంబైలో సీటు సాధించిన పోలీస్ అధికారి కుమార్తెకు సీపీ అభినందనలు

**విధుల్లో రాణిస్తూనే పిల్లల అభ్యున్నతికి కృషి చేయాలి : సన్‌ప్రీత్ సింగ్**




**హన్మకొండ, 17 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పోలీస్ అధికారులు తమ విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూనే పిల్లల విద్యాభివృద్ధి, ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ ముంబైలో ప్రవేశం సాధించిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కుమార్తెను ఆయన ఘనంగా సత్కరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న యడ్లపల్లి సతీష్ కుమార్తె యడ్లపల్లి సాత్విక జేఈఈ మెయిన్స్ పరీక్షలో 99.65 పర్సంటైల్ సాధించింది. అనంతరం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో 8808 ఆల్ ఇండియా ర్యాంక్‌ను కైవసం చేసుకుని ఐఐటీ ముంబైలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సీటు పొందింది. ఈ సందర్భంగా సాత్వికను తన చేతుల మీదుగా సన్మానించిన కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో ఒకటైన ఐఐటీలో ప్రవేశం సాధించడం గొప్ప విజయమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆమెకు సూచించారు. ఇటీవలి కాలంలో పోలీసు సిబ్బంది పిల్లలు విద్యారంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందడం, ప్రతిష్ఠాత్మక ఉద్యోగాలను సాధించడం ఆనందదాయకమని సీపీ పేర్కొన్నారు. సాత్విక సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని సాత్వికకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ గృహంతో నెరవేరిన సొంతింటి కల

**సుదన్‌పల్లిలో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ**



**హసన్‌పర్తి, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్):**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదన్‌పల్లి గ్రామానికి చెందిన కోడెపాక స్వప్న సాగర్‌కు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరుకావడంతో బుధవారం ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకారపు లక్ష్మి, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆకారపు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోందన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారుడు కోడెపాక స్వప్న సాగర్‌కు సూచించారు. ఇంటి నిర్మాణ పనుల ప్రారంభ సందర్భంగా కోడెపాక ప్రమీల, సారయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, నరేష్, మహేందర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొని లబ్ధిదారుడికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ గృహ పథకం ద్వారా సొంతింటి కల నెరవేరడంతో స్వప్న సాగర్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఎస్ఐఆర్-2026 అవగాహన కోసం నేడు 2కె రన్

**అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొనాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**

**హన్మకొండ, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)పై ప్రజల్లో, ముఖ్యంగా ఓటర్లలో అవగాహన కల్పించేందుకు గురువారం ఉదయం 7 గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ, అదాలత్ సర్కిల్‌లోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ప్రారంభమయ్యే 2కె రన్ జిల్లా కలెక్టరేట్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ రన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెప్పడంతో పాటు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## ఎల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



**హసన్ పర్తి, 17 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట నియోజకవర్గంలోని హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ మరియు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి గృహాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబాలను అభినందించిన నాయకులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుస్థిర ప్రపంచ నిర్మాణానికి 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' మార్గదర్శి: ఆచార్య మహేంద్ర దేవ్

**న్యూఢిల్లీ, జూన్ 17 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యుడు ఆచార్య బి. సురేష్ లాల్ రచించిన "వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్" పుస్తకాన్ని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఆచార్య ఎస్. మహేంద్ర దేవ్ బుధవారం న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య మహేంద్ర దేవ్ మాట్లాడుతూ, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణలు లేని సమాజ నిర్మాణానికి ఈ గ్రంథం దార్శనికతతో కూడిన ఆచరణాత్మక మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, సుస్థిర భవిష్యత్తు సాధనకు అవసరమైన విలువైన ఆలోచనలు, విధాన సూచనలను ఈ పుస్తకం అందిస్తోందని కొనియాడారు. పుస్తక రచయిత ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ, సున్నా పేదరికం, సున్నా నిరుద్యోగం, సున్నా అసమానత, సున్నా నికర కార్బన్ ఉద్గారాలు, సున్నా సంఘర్షణ అనే ఐదు ప్రధాన లక్ష్యాల ఆధారంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి, ప్రపంచ శాంతి సాధనకు అవసరమైన విధానాలను ఈ గ్రంథంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. కేస్ స్టడీలు, నిపుణుల విశ్లేషణలు, కార్యాచరణ వ్యూహాల ద్వారా ఈ లక్ష్యాల పరస్పర అనుసంధానాన్ని సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ చేతన్ గాటే, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య ఎ.డి.ఎన్. భాజ్‌పాయ్, జనరల్ సెక్రటరీ ఆచార్య రవీంద్ర బర్మే, ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య అశ్విని మహాజన్ తదితరులు పాల్గొని ఆచార్య బి. సురేష్ లాల్‌ను అభినందించారు.




## నిరుద్యోగ యువతకు శుభవార్త..

**జూన్ 18న వరంగల్‌లో మెగా జాబ్ మేళా**




**వరంగల్, 17 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 18న వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలు పేటీఎం, టీయూవీ రైన్‌లాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. ఎంసీసీ వరంగల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాలో మొత్తం 42 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పేటీఎం సంస్థలో 40 సేల్స్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయస్సు 20 నుంచి 38 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.18,500 నుంచి రూ.35,000 వరకు వేతనం అందించనున్నారు. అలాగే టీయూవీ రైన్‌లాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఈవీ టెక్నీషియన్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మొబిలైజర్ పోస్టులకు ఒక్కో ఖాళీ చొప్పున భర్తీ చేపట్టనున్నారు. ఈవీ టెక్నీషియన్ పోస్టుకు ఈఈఈ, ఈసీఈ లేదా మెకానికల్ ఇంజినీరింగ్ అర్హత ఉండాలి. మొబిలైజర్ పోస్టుకు బీటెక్ లేదా ఇతర డిగ్రీతో పాటు సంబంధిత రంగంలో అనుభవం అవసరం. ఈ పోస్టులకు 25 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల పురుష అభ్యర్థులు అర్హులు. నెలకు రూ.20,000 నుంచి రూ.35,000 వరకు వేతనం చెల్లించనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. మరిన్ని వివరాల కోసం జిల్లా ఉపాధి కార్యాలయం వాట్సాప్ ఛానల్ dee_warangal, ఇన్‌స్టాగ్రామ్ ఛానల్"dee_warangal_"ను అనుసరించాలని కోరారు.

## డీఈఈసెట్-2026 వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

**జూన్ 18 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం**

**జూలై 1 నుంచి విద్యా సంవత్సరం ప్రారంభం**




**వరంగల్, 17 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈసెట్--2026)లో అర్హత సాధించిన అభ్యర్థుల కోసం రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) 2026-28 విద్యా సంవత్సరానికి సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డి.ఈఐ,ఎడ్.), డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ (డి.పి.ఎస్.ఈ) కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు జూన్ 18 నుంచి 20 వరకు అధికారిక వెబ్‌సైట్ https://deecet.cdse.telangana.gov.in ద్వారా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. వెబ్ ఆప్షన్ల నమోదుకు ముందు అభ్యర్థులు ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, ఎస్ఎస్‌సీ లేదా సమాన అర్హత సర్టిఫికెట్లు, కుల ధృవపత్రం, ఆదాయ ధృవపత్రం, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ), ఎన్‌సీసీ, క్రీడలు, పీహెచ్‌సీ తదితర ధృవపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అభ్యర్థులకు సహాయంగా జూన్ 19, 20 తేదీల్లో ఆన్‌లైన్ హెల్ప్‌డెస్క్ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. జూన్ 21న స్లైడింగ్, బదిలీ (ట్రాన్స్‌ఫర్) ఆప్షన్లతో కూడిన తుది వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపును జూన్ 25న ప్రకటించనుండగా, ఎంపికైన అభ్యర్థులు జూన్ 27లోపు ఫీజు చెల్లించి సంబంధిత కళాశాలల్లో ప్రవేశం పొందాల్సి ఉంటుంది. 2026-28 విద్యా సంవత్సరపు తరగతులు జూలై 1 నుంచి ప్రారంభమవుతాయని ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని పరిశీలించాలని అధికారులు సూచించారు.

## హైదరాబాద్‌లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

**హైదరాబాద్,జూన్17(జై భీమ్ న్యూస్):**

ప్రముఖ విద్యుత్ కార్ల తయారీ సంస్థ టెస్లా హైదరాబాద్‌లో తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ టెస్లా 2026 మోడల్ వై ప్రీమియమ్ రేర్ వీల్ డ్రైవ్, మోడల్ వై ఎల్ వాహనాలను వినియోగదారులు పరిశీలించొచ్చని టెస్లా వెల్లడించింది. టెస్లాలో వాడుతన్న సాంకేతికత, భద్రతా ఫీచర్లు, వాహన పనితీరును పరిశీలించ వచ్చని పేర్కొంది. దీంతో పాటు బొల్లారం పారిశ్రామిక వాడలో డెలివరీ, విక్రయానంతర సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. బెంగళూరు, ముంబయి, దిల్లీ, గురుగ్రామ్‌లో ఇప్పటికే టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను నెలకొల్పగా.. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ భారత్‌లో ఐదోది కావడం విశేషం.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 19 మంది పట్టివేత..

ఒకరికి సామాజిక సేవ శిక్ష, 23 మందికి జరిమానాలు




**వరంగల్, 17 జూన్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీసుల డ్రంకెన్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలలో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 19 మంది వ్యక్తులను బుధవారం కోర్టులో హాజరుపరిచారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించారు. నిందితులను గౌరవ మేజిస్ట్రేట్ రాజ్ నిధి ఎదుట హాజరుపరచగా, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెంకు చెందిన బొడిగే రంజిత్‌కు రూ.2,000 జరిమానాతో పాటు రెండు రోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. శిక్షలో భాగంగా అతడిని వరంగల్ ఆయుర్వేద ఆసుపత్రికి పంపినట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన 18 మంది నిందితులకు మొత్తం రూ.14,500 జరిమానా విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మరో ఐదుగురిని కోర్టులో హాజరుపరచగా, వారికి మొత్తం రూ.2,500 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించబోమని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత హెచ్చరించారు.

## రసాయన శాస్త్ర విభాగ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు



**హన్మకొండ, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మరో కీలక అడుగు పడింది. హైదరాబాద్‌కు చెందిన అరోరా లైఫ్ సైన్సెస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విభాగంలో ప్రాంగణ నియామక (క్యాంపస్ రిక్రూట్‌మెంట్) ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలో ప్రకటించనున్నట్లు విభాగాధిపతి ఎన్. వాసుదేవ రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా, జూన్ 15న హైదరాబాద్‌లోని సాయి లైఫ్ సైన్సెస్ నిర్వహించిన స్కిల్లింగ్ ప్రోగ్రాంలో రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలోనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ పరిశ్రమలు, ఔషధ సంస్థలతో విభాగం నిరంతరం సమన్వయం కొనసాగిస్తోందని ఆచార్య వాసుదేవ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు బాటలు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ఆరుట్లలో సరదాగా గడిపిన సిఎం రేంవత్

విద్యార్థులతో కలసి బ్రేక్ ఫాస్ట్..
ఫుట్ బాల్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన సిఎం

**రంగారెడ్డి,జూన్17(జై భీమ్ న్యూస్):**

రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో జిల్లాకు చేరుకున్న సీఎం.. హెలిప్యాడ్ నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్ వరకు పాఠశాలకు చెందిన బస్సులో ప్రయాణించారు. అనంతరం టీపీఎస్‌ను ప్రారంభించి.. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో మాట్లాడారు. ప్రీ-ప్రైమరీ విభాగాలను సందర్శించారు. పాఠశాల లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను సందర్శించిన సీఎం.. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సీఎం మొక్క నాటారు. డ్యాన్స్, మ్యూజిక్ రూమ్‌ను సందర్శించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. కిచెన్‌ను సందర్శించి పూరీలు చేశారు. మొత్తంగా సరదాగా గడిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆరుట్లలో బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కాజీపేట రైల్వే స్టేషన్‌లో మానవ అక్రమ రవాణాపై విస్తృత అవగాహన కార్యక్రమం

అప్రమత్తతతోనే హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అరికట్టవచ్చు : ఇన్స్పెక్టర్ అభినవ్

**కాజీపేట, 17 జూన్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

సమాజంలో పెరుగుతున్న మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) నేరాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని ఇన్స్పెక్టర్ అభినవ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాజీపేట రైల్వే స్టేషన్‌లో బుధవారం "యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్"ను నిర్వహించారు. సిర్ప్ కాజీపేట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైల్వే ప్రయాణికులు, స్థానిక ప్రజలకు మానవ అక్రమ రవాణా వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అభినవ్ మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా అనేది దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న సామాజిక నేరమని అన్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, నిరుపేద కుటుంబాలకు చెందిన యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు ముఠాలు ఉద్యోగాలు, విద్య, వివాహాలు, మెరుగైన జీవితం పేరుతో మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. అమాయక ప్రజలు ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్మి వారి వలలో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు..రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాలు మానవ అక్రమ రవాణాదారులకు అనుకూల ప్రదేశాలుగా మారే అవకాశం ఉన్నందున ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. ముఖ్యంగా చిన్నారులు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు, భయాందోళనలకు గురైనట్లు కనిపించినప్పుడు లేదా అనుమానాస్పద వ్యక్తులు వారిని బలవంతంగా తీసుకెళు న్నట్లు అనిపించిన సందర్భాల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే మహిళలు, యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు సంబంధిత సంస్థల వివరాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని, ఎవరైనా తప్పుడు హామీలతో ఆకర్షించే ప్రయత్నం చేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల సమన్వయంతోనే మానవ అక్రమ రవాణా వంటి నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేసి, మానవ అక్రమ రవాణా లక్షణాలు, జాగ్రత్తలు, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, సమాజంలో అవగాహన పెరిగితేనే ఇలాంటి నేరాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయగలమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అభినవ్‌తో పాటు సిబ్బంది ఆలీ, అహ్మద్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# కృత్రిమ మేధస్సు యుగంలోనూ మానవ భావోద్వేగాలకు ప్రత్యామ్నాయం లేదు

కాకతీయ విశ్వవిద్యాలయంలో రెండ్రోజుల జాతీయ సదస్సు ముగింపు



**హన్మకొండ, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచీకరణ, డిజిటలీకరణ, కృత్రిమ మేధస్సు (ఏఐ) వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కూడా మానవ భావోద్వేగాలు, సృజనాత్మకతకు ఏఐ ప్రత్యామ్నాయం కాదని విద్యావేత్తలు పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ముగిసింది. "న్యూ లిటరరీ అండ్ లాంగ్వేజ్ హారిజాన్స్: వాయిసెస్, జానర్స్ అండ్ టెక్నాలజీస్" అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సు ముగింపు సమావేశానికి కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 21వ శతాబ్దంలో ఆంగ్ల భాష ప్రపంచీకరణ, డిజిటలీకరణ, కృత్రిమ మేధస్సు యుగానికి ప్రధాన మాధ్యమంగా నిలిచిందన్నారు. ఆంగ్ల సాహిత్యం సమాజం, సంస్కృతి, మానవ విలువలకు వారధిగా పనిచేస్తోందని పేర్కొన్నారు. 1967 నుంచి విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగం జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణలో విశిష్ట సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని తెలిపారు. సదస్సు ముగింపు కీలకోపన్యాసం చేసిన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆచార్యురాలు శారద తల్లం మాట్లాడుతూ, చాట్‌జీపీటీ వంటి సాంకేతిక సాధనాలు ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కావని స్పష్టం చేశారు. ఈ-బుక్స్, ఆడియో బుక్స్, డిజిటల్ కథనాల ద్వారా సాహిత్య అనుభవం కొత్త రూపు దాల్చినప్పటికీ, మానవ భావోద్వేగాలు, సృజనాత్మక ఆలోచనలకు కృత్రిమ మేధస్సు ప్రత్యామ్నాయం కాదన్నారు. భారతీయ జ్ఞాన సంప్రదాయం ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందని, సాంకేతిక అభివృద్ధితో పాటు మానవీయ విలువలను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. సదస్సు అధ్యక్షురాలు డాక్టర్ ఆర్. మేఘనా రావు మాట్లాడుతూ, రెండ్రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో 90 పరిశోధనా పత్రాలు సమర్పించబడినట్లు తెలిపారు. అలాగే 6 సాంకేతిక సెషన్లు, 2 ప్యానెల్ చర్చలు విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, పాలక మండలి సభ్యులు ఆచార్య మల్లం నవీన్, ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి తదితరులు ప్రసంగించారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుల్వామా తరహాలో మరో దాడికి ఎత్తు

ఐఎస్ఐ ఉగ్రవాదుల ముఠా అరెస్ట్

**న్యూఢిల్లీ,జూన్17(జై భీమ్ న్యూస్):**

పాకిస్థాన్ గూఢచారి సంస్థ అయిన ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఉగ్రముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయగా.. వారిలో ఆరుగురు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. గాజియాబాద్‌లో అరెస్టయిన ఆరుగురిలో నలుగురు గతంలో పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు పంపినట్లు అనుమానిస్తున్నారు. పుల్వామా తరహాలో మరో పెద్ద దాడికి పాక్ ప్లాన్ చేస్తోందనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ ముఠా ఢిల్లీ నుంచి జమ్మూ వరకు గల ప్రముఖ రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ సంబంధిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి భారత సైనికుల కదలికలను గుర్తించేందుకు యత్నించినట్టు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే వీరు ఢిల్లీలోని కాంట్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ల వద్ద అలాంటి కెమెరాలను అమర్చినట్టు గుర్తించారు. దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భారతీయ ఫోన్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశీయులకు పంపిస్తూ వాట్సాప్, సోషల్ మీడియా అకౌంట్లను నిర్వహించుకునేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. సిమ్ కార్డుల చోరీ, గతంలోనే యాక్టివేట్ చేసిన సిమ్‌లను కొనుగోలు చేయడం వంటివి వినియోగించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలనూ తమ సొంత అకౌంట్ల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో స్వీకరించి పోలీసుల కళు గప్పేందుకు యత్నించినట్టు అధికారులు తేల్చారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపైనా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## యూరియా నిల్వలు, పంట మార్పిడిపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశం

**వరంగల్, జూన్ 17 (జై భీమ్ న్యూస్)**



రానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని యూరియా ఎరువుల సరఫరాకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా అవసరమైన నిల్వలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. యూరియా పంపిణీపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడిపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన, సహకార తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సకాలంలో సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి నీరజతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ భద్రకాళీ ఆలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ..





### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**వరంగల్, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానంలో గత మూడు రోజులుగా నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ముగిశాయి. ఉదయం 8.36 గంటలకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి చేతుల మీదుగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించడంతో కార్యక్రమం సుసంపన్నమైంది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఇరిగేషన్ ఎస్.ఈ. హరివెంకటరామ ప్రసాద్, ప్రముఖ దాతలు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ప్రతిష్ఠా కార్యక్రమం సందర్భంగా భద్రకాళీ భక్త సేవా సమితి కన్వీనర్ అయితా గోపీనాథ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థుల సమన్వయంతో వర్ధమాన ఆగమశాస్త్ర పండితులు గుమడవెల్లి గణేశ్ ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం ఆకాశాన్ని తాకుతున్నట్టుగా కనిపిస్తున్న నూతన ధ్వజస్తంభాన్ని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తుల జయజయధ్వానాలతో మారుమోగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి రామల సునీత పర్యవేక్షించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, ధర్మకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి చీర, ఓడిబియ్యం, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్‌ను దర్శించేందుకు వేల సంఖ్యలో భక్తులు, అభిమానులు ఆలయానికి తరలివచ్చారు. ఉప ముఖ్యమంత్రి సందర్శనతో ఆలయ ప్రాంగణం మరింత సందడిగా మారి ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

## ఇంతేజార్‌గంజ్ ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఇద్దరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు
### పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ డా. సత్య శారద





**వరంగల్, జూన్ 17 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా చార్‌బౌలి ప్రాంతంలోని ఇంతేజార్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యా ప్రమాణాలు, పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది హాజరు, పారిశుధ్య పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసిన కలెక్టర్, ఇద్దరు పాఠశాల సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా విధుల నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఆమె, సంబంధిత సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌కు సూచించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం కనిపించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన స్కావెంజర్‌ను మార్చాలని సూచించారు. పాఠశాల ముందు ప్రవహిస్తున్న మురికి కాలువ విద్యార్థుల భద్రతకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కాలువపై బండలు వేసి కప్పి భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల హాజరు, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న విద్యా సౌకర్యాలు, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల విద్య, భద్రత, పారిశుధ్యం విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక సదుపాయాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## “కిడ్డీ బ్యాంక్ కాదు... సీడ్ బ్యాంక్”

### పిల్లల్లో ప్రకృతి ప్రేమ పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమం
### ప్రతి ఇంట్లో సీడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని పర్యావరణ ప్రేమికుల పిలుపు





**హైదరాబాద్, 17 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పిల్లల్లో చిన్నప్పటి నుంచే ప్రకృతిపై ప్రేమ, చెట్ల పెంపకంపై అవగాహన పెంచేందుకు “కిడ్డీ బ్యాంక్ కాదు... సీడ్ బ్యాంక్” అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు, విద్యావేత్తలు సూచిస్తున్నారు. నేటి చిన్నారుల చేతుల్లో గింజలను పెట్టి, రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని కోరుతున్నారు. పిల్లలు రోజూ తినే మామిడి, నారింజ, నిమ్మ, జామ, సీతాఫలం వంటి పండ్ల గింజలను చెత్తబుట్టలో పడేయకుండా వాటిని శుభ్రపరిచి, ఎండబెట్టి, ఇంట్లో క్లాత్ బ్యాగ్‌లు లేదా మట్టి కుండల్లో భద్రపరచాలని సూచిస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఇంట్లో ఒక చిన్న “సీడ్ బ్యాంక్” ఏర్పాటు చేస్తే వేలాది గింజలను భవిష్యత్తు కోసం సంరక్షించవచ్చని పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత ఈ గింజలను పిల్లల చేతులతో గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాలు, రహదారుల పక్కలు, పాఠశాలల పరిసరాలు, దేవాలయాలు, కొండ ప్రాంతాలు, తీర్థయాత్ర మార్గాలు, చెరువుల కట్టలు వంటి ప్రాంతాల్లో చల్లేలా ప్రోత్సహించాలని సూచిస్తున్నారు. కొన్ని గింజలను నేరుగా భూమిలో నాటేలా చేయడం ద్వారా పిల్లల్లో ప్రకృతితో అనుబంధం పెరుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తగ్గిపోతున్న పచ్చదనం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి గింజ ఒక చెట్టుగా ఎదగడం ఎంతో అవసరమని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు. ఒక చిన్న గింజ నేడు మొలకెత్తి రేపు మహావృక్షంగా మారి నీడను, ఆక్సిజన్‌ను, పండ్లను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పిల్లలు పాఠశాలకు వెళ్లే సమయంలో, గ్రామాల్లో నడక మార్గాల్లో, కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణాలు చేసే సందర్భాల్లో గింజలను చల్లే అలవాటు పెంపొందిస్తే భవిష్యత్తులో వేలాది చెట్లు పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పంచాయతీలు భాగస్వామ్యం కావాలని సూచిస్తున్నారు. “నేడు పిల్లల చేతిలో గింజలు... రేపు గ్రామాల నిండా చెట్లు” అనే నినాదంతో ప్రతి కుటుంబం ముందుకు రావాలని, ప్రతి ఇంట్లో ఒక “సీడ్ బ్యాంక్” ఏర్పాటు చేసి పచ్చని తెలంగాణ నిర్మాణానికి తోడ్పడాలని పర్యావరణ ప్రేమికులు పిలుపునిస్తున్నారు. చిన్నారులలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తూ భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఎర్రగట్టు గుట్ట నుంచి అంబాల ప్రధాన రహదారిపై మంటలు..

### ఎండల కారణంగా మంటలు చెలరేగాయా..? లేక ఎవరైనా నిప్పు పెట్టారా..? ప్రజల అనుమానాలు

**హన్మకొండ జిల్లా/హాసన్‌పర్తి, 17 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా హాసన్‌పర్తి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఎర్రగట్టు గుట్ట నుంచి అంబాల ప్రధాన రహదారిలోని పెంబర్తి గ్రామ సమీప ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా ఎండిన పొదలు, గడ్డి, చెట్లకు మంటలు అంటుకోవడంతో అగ్నికీలలు వేగంగా వ్యాపించి విస్తారమైన ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. మంటలతో పాటు భారీగా పొగలు వ్యాపించడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం ఎర్రగట్టు గుట్ట పరిసర ప్రాంతంలో ప్రారంభమైన మంటలు గాలివేగానికి తోడు వేగంగా వ్యాపించి అంబాల ప్రధాన రహదారి వరకు చేరుకున్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ఎండిన గడ్డి, పొదలు, చిన్నచిన్న చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. కొన్నిచోట్ల మంటలు చెట్ల కొమ్మలను తాకుతూ ఎగిసిపడగా, మరికొన్ని ప్రాంతాల్లో దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేసింది. అగ్నిప్రమాదం కారణంగా అంబాల ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగ దట్టంగా వ్యాపించడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా, నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. కొందరు వాహనాలను రహదారి పక్కన నిలిపివేసి పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు వేచి చూశారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలు మరింత వ్యాపించకుండా ప్రయత్నాలు చేపట్టారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మంటలు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ల సమీపానికి చేరుకోవడంతో ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై ప్రస్తుతం స్పష్టత లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీవ్రమైన ఎండలు, పొడి వాతావరణం కారణంగా సహజంగానే మంటలు చెలరేగాయా..? లేక ఎవరైనా కావాలనే నిప్పు పెట్టారా..? అనే కోణంలో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు పడి మంటలు వ్యాపించి ఉండవచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చినప్పటికీ, పెద్దఎత్తున పొదలు, చెట్లు, గడ్డి దగ్ధమై వృక్ష సంపదకు నష్టం వాటిల్లింది. పర్యావరణానికి హాని కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అటవీ, విద్యుత్, రెవెన్యూ శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అగ్నిప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, నష్టంపై అధికారుల నివేదిక వెలువడాల్సి ఉంది.

## అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలకై డీసీపీకి వినతిపత్రం అందజేత - టీఆర్పీ యూత్ నాయకులు

**జనగామ, జూన్ 17 (జై భీమ్ న్యూస్)**

జనగామ పట్టణంలో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) యూత్ నాయకులు జనగామ డీసీపీని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్పీ నాయకులు మాట్లాడుతూ జనగామ పట్టణంలోని బతుకమ్మ కుంట, ధర్మకంచ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు బహిరంగంగా మద్యం సేవించడం, సిగరెట్లు తాగడం, మత్తు పదార్థాలు వినియోగించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల కారణంగా విద్యార్థులు, మహిళలు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా బతుకమ్మ కుంట ప్రాంతంలో సాయంత్రం, రాత్రి వేళల్లో కొందరు మద్యం సేవించి ఖాళీ మద్యం సీసాలను వాకింగ్ ట్రాక్‌పై పగులగొడుతున్నారని తెలిపారు. దీంతో ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే ప్రజలు, చిన్నారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. అలాగే పాఠశాలల సమీప ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగం పెరుగుతుండటం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీసీపీని కోరారు. సంబంధిత ప్రాంతాల్లో పోలీస్ పహారా పెంచడంతో పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేసి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన డీసీపీ సమస్యను సానుకూలంగా పరిశీలించి, వెంటనే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా టీఆర్పీ అధ్యక్షుడు కట్ల సదానందం, జిల్లా టీఆర్పీ యూత్ అధ్యక్షుడు పిట్టల సురేష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు యాకూబ్ పాషా (బబ్లు), జిల్లా యూత్ కార్యదర్శి చెన్నూరు వంశీ, జిల్లా కార్యదర్శి వరికుప్పల గంగరాజు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు యామంకి విజయ్, పట్టణ అధ్యక్షుడు పానుగంటి కృష్ణ, టీఆర్పీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు వెంపటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# కులోన్మాద మతోన్మాదం ప్రేరేపించే అసాంఘిక శక్తులను శిక్షించాలి

**విశ్వ విద్యాలయ రక్షణ నిర్మాణానికి కట్టుబడి ఉండాలి**
**ఉన్నతాధికారులను మోసగిస్తూ పదవుల్లో కొనసాగడం సిగ్గుకరం**
**అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదు**
**విశ్వవిద్యాలయ ఉనికిని విశ్వవిద్యాలయ భవిష్యత్తును దెబ్బ కొడుతున్నారు**
**బొల్లికుంట వీరేందర్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**




విశ్వవిద్యాలయ రక్షణ కోసం ఐక్య ఉద్యమాలను కొనసాగించడానికి విద్యార్థి సంఘాలు ఎప్పుడు కట్టుబడి ఉంటాయని భహుజన విద్యార్థి సంఘాల నేతలు తెలియజేయడం జరిగింది. అధికారులు ఏకపక్షమైన నిర్ణయాలతో విశ్వవిద్యాలయ భవిష్యత్తును నాశనం చేయాలని ప్రయత్నం చేస్తున్న ప్రతి సందర్భంలో విద్యార్థులు ముందుండి పోరాటాలు చేస్తూ అధికారుల ఒంటెద్దు పోకడలను వ్యతిరేకిస్తూ విశ్వవిద్యాలయాన్ని కాపాడుకున్న సందర్భాలు ఎన్నో కలవని తెలియజేస్తూ బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం అతిథిగృహంలో సమావేశమైన బహుజన విద్యార్థి నేతలు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పలు అంశాల పట్ల సుదీర్ఘంగా చర్చించుకోవడమే కాకుండా,అనధికార హోదాలలో కొనసాగుతున్న ఓఎస్డి,వెంకట్రామ్ రెడ్డిని,మామిడాల ఇస్తారిని, పదవుల కెళ్ళి తొలగిస్తూ వాళ్లపై "సిట్" విచారణ నిర్వహించాలని ప్రధాన డిమాండ్ గా పెట్టుకొని సమావేశం నిర్వహించుకున్నట్లు బహుజన విద్యార్థి సంఘాల నేతలు తెలియజే సారు

**విద్యార్థి జేఏసీ నాయకుల వివరణ:**

బుధవారం కాకతీయ యూనివర్సిటీ అతిథి గృహం నందు కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొచ్చు తిరుపతి ఆధ్యర్యంలో కేయూ విద్యార్థి సంఘాల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.. ముఖ్య అతిథిలుగా పాల్గొన్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ బొల్లికుంట వీరేందర్ కేయూ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మంద వీరస్వామి పాల్గొన్నారు అనంతరం వారు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీలో రోజు రోజుకీ అగ్రవర్ణ ఆధిపత్య ధోరణి పెరిగిపోతుందని అన్నారు ఈ మధ్యకాలంలో మాదిగ సామజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ల ఉనికిని దెబ్బతీసే విధంగా లేని పోనీ అభండాలను చెప్పుతూ తన కను సైగలో పత్రిక పేపర్లను పెంచి పోచిస్తూ తప్పుడు వార్తలను రాయిస్తూ విద్యార్థులను ప్రొఫెసర్లును మానసిక క్షోభానికి గురి చేస్తున్నారు..యూనివర్సిటీ అభివృద్ధిని అడ్డుకుంటున్న వైస్ ఛాన్సర్ స్పందించకపోవడం చాలా సిగ్గుమాలిన చర్య అని విద్యార్థి సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు అన్నారు..యూనివర్సిటీ రక్షణ కోసం బహుజన సంఘాల ఆధ్వర్యంలో మరో రకమైన ఉద్యమాలకు దారులు వేస్తున్నామని అసాంఘిక శక్తులుగా అవినీతిపరులుగా అధికార హోదాలను అంటిపెట్టుకొని విశ్వవిద్యాలయాన్ని విశ్వవిద్యాలయ మనుగడను దెబ్బతీయడానికి ప్రయత్నం చేస్తున్న ఆచార్య, అధ్యాపకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.ఒక అగ్రవర్ణానికి చెందిన ఓఎస్డి వెంకట్రామ్ రెడ్డి గతంలో విశ్వవిద్యాలయంపై ఏ విధంగా కక్ష సాధింపులకు పాల్పడ్డాడో విద్యార్థులను ఏ విధంగా వేధించాడో అధికార పదవులలో ఉంటూ దళిత వర్గాలను బహుజన వర్గాలను విద్యార్థినేతలను ఎంతగా అణిచివేసాడో,ఎన్ని రకాల కేసులు పెట్టించాడు మనందరికీ తెలిసిన విషయమేనని గుర్తు చేస్తూ అనధికార హోదాలో వీసీ పేరు చెప్పుకొని ఓఎస్డి గా కొనసాగుతూ బహుజన వర్గాలను తీవ్రమైన మనోవేదనకు గురి చేస్తున్న వెంకట్రామ్ రెడ్డి తక్షణమే ఓఎస్డీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా కేయూలో ఓఎస్డి అనే పదవిని పూర్తిగా తొలగించి విశ్వవిద్యాలయ నియమాలకు కట్టుబడి ఉండాలని వీసీ రిజిస్ట్రార్ లను కోరడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అలవాల కార్తీక్, బైరపాక ప్రశాంత్ మంద భాస్కర్ దుప్పటి కిషోర్ మంద నరేష్ కలకోట్ల సుమన్ మట్టెడ కుమార్ కామాగోని శ్రవణ్ మర్రి మహేష్ కళ్లేపల్లి ప్రశాంత్ బోస్కా నాగరాజు పుల్యాల బద్రి కుమ్మరి శ్రీనాథ్ అడ్డూరి గణేష్ గణిపాక ప్రదీప్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభంలో ప్రపంచం

**ఆర్థికంగా వెనకబడ్డ దేశాలను ఆదుకోవాలి**
**జి-7 సైదస్సులో ప్రధాని మోడీ వెల్లడి**

**ప్యారిస్,జూన్17(జై భీమ్ న్యూస్):**




ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ, వాణిజ్య గణాంకాలను దాటి, ఆర్థిక వృద్ధిపై చర్చలు ఉండాలన్నారు. 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ జరపడం మంచి విషయమన్నారు. వృద్ధి గురించి ప్రస్తావన వస్తే.. జీడీపీ, వాణిజ్య గణాంకాలు ప్రధానంగా ఉండకూడదు. ఎవరిది వృద్ధి..ఎవరికి వృద్ధి.. అది ఏ దిశలో ఉంది.. అనే అంశాలను చర్చించాలని మోదీ పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. దీనిని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన దేశాలను వాటిమానాన వాటిని వదిలేయొద్దని, వాటికి సహకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతోన్న దేశాలు ఈ షాక్‌లను తట్టుకొనేలా వ్యవస్థలు ఉండాలన్నారు. ఆయా దేశాల్లో ఉన్న మానవ వనరులను ప్రపంచ అభివృద్ధి భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సు నేపథ్యంలో ఇంతకుముందు మోదీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో.. మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ ఆహ్వానం మేరకు మన ప్రధాని అక్కడకు వెళ్లారు. జీ-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, యూఎస్ఏ సభ్య దేశాలు. ఐరోపా యూనియన్ కూడా ఈ సదస్సుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

# విద్యా విభాగంలో వేగవంతమైన అభివృద్ధి





**వీసి రిజిస్ట్రార్ల సూచనలు ఎంతో మేలు చేస్తున్నాయి.**
**విద్యా విభాగాన్ని గాడిలో పెట్టిన ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ .**
**యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అభివృద్ధిలో కీలకపాత్రుడు ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్**
**పెండింగ్ విద్యా కార్యక్రమాలకు ముగింపు.**
**విద్యా పరిపాలనలో కొత్త ఒరవడిని సృష్టించిన హెడ్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్.**

**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని విద్యా కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతను తనకు అప్పగించిన సందర్భంలో ఎంతో సమర్థవంతంగా నిర్వహించడం కొరకు సర్వవిధాలుగా ప్రయత్నాలు చేసుకుంటూ సమస్యల సుడిగుండం లాంటి విద్యా కళాశాల విభాగాన్ని సామరస్యపూర్వకమైన విధానంలోనికి నడిపించడమే కాకుండా దీర్ఘకాలికంగా నిలిచిపోయిన సమస్యలను పరిష్కరించుకుంటూ కేయూ ఉన్నతాధికారులైన వీసీ ఆచార్య ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం,కళాశాల అభివృద్ధి కొరకు కళాశాల అకాడమిక్ పరమైన విధానాలను అమలుపరచడం కొరకు పలు సందర్భాల్లో నిర్వహిస్తున్న సమీక్ష సమావేశాలలో సూచిస్తున్న సూచనలు గాని సహకరిస్తున్న విధానం గాని తన అధికార పదవిలో దోహదపడుతున్నాయని తెలియజేస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ ఒక ప్రత్యేకమైన ప్రకటనలో తెలియజేశారు.

**ప్రిన్సిపాల్ బాధ్యత నెరవేర్పు..**

ఒక విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను నిర్ణయించేది కేవలం తరగతి గదుల్లో జరిగే బోధన మాత్రమే కాదు. అకాడమిక్ క్యాలెండర్‌ను సమయానికి అమలు చేయడం, పరీక్షలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం, మూల్యాంకనాన్ని పారదర్శకంగా పూర్తి చేయడం, విద్యార్థులకు నిర్ణీత సమయంలో ఫలితాలను అందించడం, విద్యా పరిపాలనలో క్రమశిక్షణను నెలకొల్పడం కూడా అంతే కీలకమైన అంశాలు. ఈ ప్రమాణాలన్నింటినీ ఆచరణలో చూపిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మరోసారి విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. అక్టోబర్--2025లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ హెడ్ అండ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్. నల్లాని శ్రీనివాస్, బాధ్యతలు చేపట్టే సమయానికి నెలకొన్న క్లిష్టమైన అకాడమిక్ పరిస్థితిని సవాల్‌గా స్వీకరించారు. ఎం.ఎడ్., బి.ఎడ్. కోర్సులకు సంబంధించిన అంతర్గత పరీక్షలు, ప్రాక్టికల్ పరీక్షలు, సిద్ధాంత పరీక్షలు, మూల్యాంకనం, మోడరేషన్, ఫలితాల ప్రకటన వంటి అనేక ప్రక్రియలు వివిధ దశల్లో నిలిచిపోయి ఉండటంతో అకాడమీ వ్యవస్థ అంతా గందరగోళంగా ఉండడంతో బి.ఎడ్, ఎం. ఎడ్ విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అకాడమిక్ క్యాలెండర్ పూర్తిగా వెనుకబడిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రణాళికాబద్ధ గా కార్యాచరణ రూపొందించిన డాక్టర్ నల్లాని శ్రీనివాస్, అధ్యాపకులు, పరీక్షల విభాగం, విశ్వవిద్యాలయ అధికారులతో నిరంతర సమన్వయం సాధించారు. ప్రతి పెండింగ్ అంశాన్ని ప్రత్యేకంగా గుర్తించి దశలవారీగా పూర్తి చేసే విధంగా కార్యాచరణ చేపట్టారు. ఫలితంగా నిలిచిపోయిన పరీక్షల నిర్వహణ, ప్రాక్టికల్ రికార్డుల మూల్యాంకనం, మోడరేషన్, ఫలితాల ప్రకటన వంటి అన్ని కార్యక్రమాలు వేగవంతమయ్యాయి. కొద్ది నెలల్లోనే విద్యా కళాశాల అకాడమిక్ వ్యవస్థ తిరిగి గాడిలో పడింది. ప్రస్తుతం ఎం.ఎడ్. మొదటి, నాల్గవ సెమిస్టర్లు, బి.ఎడ్. నాల్గవ సెమిస్టర్‌కు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు, మూల్యాంకనం విజయవంతంగా పూర్తయ్యాయి. సిద్ధాంత పరీక్షలు కొనసాగుతుండగా, అనంతరం మోడరేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఎం.ఎడ్. మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన మిగిలిన ప్రాక్టికల్ పరీక్షలు కూడా తుది దశకు చేరుకున్నాయి. ఇక ఎం.ఎడ్. రెండవ, బి.ఎడ్. రెండవ సెమిస్టర్ విద్యార్థుల టీచింగ్ ప్రాక్టీస్, ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలను కూడా ముందస్తు ప్రణాళికతో అమలు చేస్తున్నారు. హనుమకొండ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించేందుకు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించి సంబంధిత కళాశాలలకు పంపించారు.

**మోడరేషన్ విధానంలో చట్టబద్ధతకు ప్రాధాన్యం**

గతంలో బి.ఎడ్.,ఎం.ఎడ్. ప్రాక్టికల్ రికార్డుల మోడరేషన్ ప్రక్రియను స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తించిన డా.నల్లాని శ్రీనివాస్, ఈ అంశాన్ని ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్రంగా పరిశీలించిన ఉపకులపతి, స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం లేకుండా మోడరేషన్ నిర్వహించడం విశ్వవిద్యాలయ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేసి ఈ అంశాన్ని స్టాండింగ్ కౌన్సిల్ సమావేశ అజెండాలో చేర్చి అధికారిక ఆమోదం పొందేలా కె యు. ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి చర్యలు చేపట్టారు. దీని ఫలితంగా ఎం.ఎడ్., బి.ఎడ్. కోర్సులకు సంబంధించిన అంతర్గత ప్రాక్టికల్ రికార్డుల మోడరేషన్ ప్రక్రియకు చట్టబద్ధత, పరిపాలనా పారదర్శకత, నిబంధనల ప్రకారం నిర్వహణకు బలమైన పునాది ఏర్పడింది. విద్యా పరిపాలనలో ఇది ఒక కీలక సంస్కరణగా భావిస్తున్నారు.

**టీచింగ్ ప్రాక్టీస్‌కు వినూత్న రూట్ మ్యాప్**

టీచింగ్ ప్రాక్టీస్ పర్యవేక్షణలో కూడా వినూత్న విధానాన్ని అమలు చేశారు. ప్రతి అధ్యాపకుడికి నిర్దిష్ట పాఠశాలలు కేటాయిస్తూ వారాంత ప్రణాళిక రూపొందించారు. ప్రతిరోజూ ఒక అధ్యాపకుడు పరిశీలనకు వెళ్లే విధంగా షెడ్యూల్ రూపొందించడం ద్వారా ఒకవైపు కళాశాలలో రెగ్యులర్ తరగతులకు అంతరాయం కలగకుండా, మరోవైపు టీచింగ్ ప్రాక్టీస్ సమర్థవంతంగా కొనసాగించే విధంగా వ్యవస్థను రూపొందించారు. ఈ ప్రణాళిక విద్యార్థుల బోధనా నైపుణ్యాల అభివృద్ధికి, అధ్యాపకుల సమర్థవంతమైన పర్యవేక్షణకు దోహదపడుతోంది.

**టీచింగ్--లెర్నింగ్ మెటీరియల్ మేళా ఉపాధ్యాయ విద్యలో కొత్త అధ్యాయం**

విద్యా కార్యక్రమాల నిర్వహణతో పాటు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచింగ్--లెర్నింగ్ మెటీరియల్ (డిఎల్ఎమ్) మేళా--2026 విశేష స్పందన పొందింది. విద్యార్థి-కేంద్రిత బోధన, సృజనాత్మక అభ్యాసం, అనుభవాత్మక విద్యకు ఈ మేళా వేదికగా నిలిచింది. ఉపాధ్యాయ శిక్షణార్థులు స్వయంగా రూపొందించిన బోధనా సామగ్రి, వినూత్న నమూనాలు, శాస్త్రీయ ప్రయోగాలు, సృజనాత్మక బోధనా పద్ధతులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. "నేర్చుకుంటూ బోధించడం -- బోధిస్తూ నేర్చుకోవడం" అనే విద్యా తత్వాన్ని ఆచరణలో ప్రతిబింబించిన ఈ కార్యక్రమం జాతీయ విద్యా విధానం--2020 లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించబడింది.

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో విద్యార్థుల ప్రతిభ**

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" ప్రదర్శనలో కాకతీయ విశ్వవిద్యాలయం తరపున యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థులు పాల్గొని విశేష ప్రశంసలు అందుకున్నారు. డా. నల్లాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన హైడ్రాలిక్ బ్రిడ్జ్ నమూనా, వాతావరణ కాలుష్య నమూనాలు, పారిశ్రామిక అభివృద్ధి నమూనాలు, మానవ జీవ వికాస ప్రక్రియ, విద్యుత్ నమూనాలు, ఆధునిక బోధనా సాధనాలు, విద్యా సమస్యలపై అవగాహన కల్పించే ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యా రంగంలో సృజనాత్మకతను సమాజానికి చేరవేసే ప్రయత్నంగా ఈ ప్రదర్శన నిలిచింది.

**నాణ్యమైన విద్యా పరిపాలనకు నాంది**

ఈ సందర్భంగా డా. నల్లాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపకులపతి ఆచార్య ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వల్లూరి రామచంద్రం తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అకాడమిక్ క్యాలెండర్‌ను క్రమబద్ధీకరించడం, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడం, విద్యార్థులకు సమయానికి ఫలితాలు అందించడం, పరిపాలనను సమర్థవంతంగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారుల సహకారంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు.




# హార్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

**భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం**
**హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం**
**ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ**
**మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య**

**ప్యారిస్,జూన్17(జై భీమ్ న్యూస్):**

హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోడీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

# రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి**
**పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి**
**సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు**
**కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి**

**హైదరాబాద్,జూన్17(జై భీమ్ న్యూస్):**

రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టా భూమిలో పగరాజేస్తున్న సర్పంచ్







**సర్పంచ్ బాబు ఆగడాలు దినదినం మితిమీరిపోతున్నాయి.**
**పట్టాదారులపై దాడులు చేయిస్తున్న సర్పంచ్ బాబు.**
**60 సంవత్సరాలు సాగుకాలంలో ఉన్న భూమిలో సర్పంచ్ ఫకర్ చూపిస్తున్నాడు.**
**ఏకంగా పోలీసుల పైకే దౌర్జన్యానికి దిగుతున్నాడు.**
**పలుమార్లు పట్టాదారులను భౌతికంగా కొట్టిస్తున్నాడు.**
**సాగు చేసుకుంటున్న పట్టా భూమి పైకి తన కుటుంబ సభ్యులను అనుచరులను పంపిస్తూ గొడవలు పెట్టిస్తున్నాడు.**
**తిర్మలాయపల్లి గ్రామ శివారులో సర్వేనెంబర్ 130/1 విస్తీర్ణం 3.19 గుంటలు బరిగెల కొమరయ్యకు చెందినది.**

**వరంగల్ (రాయపర్తి) జై భీమ్ న్యూస్**

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో తిర్మలాయపల్లి గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 130/1 లో గల విస్తీర్ణం 3ఎకురాల.19గుంటల భూమి బరిగెల కుమారస్వామి తండ్రి కొమురయ్యకు చెందినదని కొమురయ్య కుమారులు పట్టాదారులుగా ఉంటూ స్థిరాస్తి పట్టా భూమిగా రికార్డులు నమోదు చేసుకొని వాళ్ళ తండ్రి కొమురయ్య 60 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకొని జీవనాన్ని గడుపుతున్నారని తెలియజేస్తున్నారు.ఇదిలా ఉండగా 60 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిలో ఎలాంటి ఇబ్బందులు గాని ఎలాంటి ఆటంకాలు గాని ఎలాంటి అవరోధాలు గాని కల్పించబడలేదని పట్టాదారులు స్పష్టంగా తెలుపుతున్నారు.పట్టాదారుడు వ్యవసాయదారుడైన బరిగెల కుమార్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం గత ఆరు నెలలుగా గ్రామ సర్పంచ్ బరిగెల బాబు సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకొని తనపై దాడి చేయించాడని తన భూమి చుట్టూ వేసుకున్న కంచెను కనీలను పూర్తిగా ధ్వంసం చేయడమే కాకుండా తన భూమిలో బలవంతంగా గోరి కట్టిస్తుండగా అడ్డుపడిన తనపై విపరీతంగా భౌతిక దాడి చేయించాడని అలాంటి సందర్భంలో తీవ్రమైన భయాందోళనలకు గురై స్థానిక పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయగా స్థానిక పోలీసు అధికారి పూర్వపరాలను విచారణ చేసి దాడి చేసిన ఘటనను నిర్ధారించుకొని తనపై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశాడని తెలియజేశాడు.మరల అంతటితో ఊరుకోకుండా సర్పంచ్ బరిగెల బాబు నాపైకి మహిళలను పంపిస్తూ బూతులు తిట్టించడమే కాకుండా మరలా దాడి చేయించాడని తెలుపడం జరిగింది.ఇలాంటి సందర్భంలోనే సర్పంచ్ బరిగెల బాబు ఆగడాలను తట్టుకోలేక జిల్లా కలెక్టర్కు వినతి పత్రం పెట్టుకున్నానని అట్టి వినతిపత్రం ఆధారంగా రాయపర్తి మండలం ఎమ్మార్వో ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్న సందర్భంలో మరల దాడికి పాల్పడినాడని ఇలా క్రమం తప్పకుండా దాడులు చేయిస్తూ,దాడులకు ఉసిగొల్పుతున్న సర్పంచ్ బరిగెల బాబును పోలీసు అధికారులు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించినప్పటికీ పోలీసులపై దౌర్జన్యానికి దిగుతూ పోలీస్ అధికారులు తెలియజేసిన మాట ప్రకారం కట్టబడి ఉండకుండా పోలీస్ ఆజ్ఞలను ధిక్కరిస్తూ మరల పదేపదే దాడులను ప్రేరేపిస్తూ మా పట్ట భూమిలో తీవ్రమైన గొడవలు పెట్టిస్తూ శాంతి భద్రతలకు పూర్తి వివాదాన్ని కల్పిస్తున్నాడని అదే సందర్భంలో పోలీస్ అధికారులు కఠినంగా వ్యవహరించడం కోసం గొడవలకు పాల్పడుతున్న వ్యక్తులను ఎమ్మార్వో ముందు బాండోవర్ చేసినప్పటికిని వాటిని కూడా పట్టించుకోకుండా తిరిగి మరల గొడవలకు దిగడం యధావిధిగా దాడులు చేయడం సర్పంచ్ హక్కులోని భాగంగా రెచ్చిపోతున్నాడని సర్పంచ్ బరిగెల బాబు పలుమార్లు తన పైకి దాడులు చేయిస్తూ చంపడానికి కుట్రలు పన్నుతున్నాడని వివరించాడు.ఒకవైపు పోలీసులు,పోలీస్ అధికారులు చెప్పిన వినకుండా మరోవైపు రెవెన్యూ ఉన్నతాధికారులు చెప్పిన పట్టించుకోకుండా పదేపదే గొడవలు చేయిస్తుండడం తన కుటుంబ సభ్యులను మా పైకి రెచ్చగొట్టడం ఇదంతా కేవలం సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకొని రాజకీయ అండదండలను అడ్డం పెట్టుకొని కొంతమంది రాజకీయ అసాంఘిక శక్తుల ప్రోద్బలంతో మా పైకి గొడవలకు దిగుతున్నారని తెలియజేశాడు.క్రైమ్ నెంబర్ 91/2026,క్రైమ్ నెంబర్96/2026,క్రైమ్ నెంబర్ 104/2026, అన్ని క్రైమ్ నెంబర్స్ ఆధారంగా పలు సెక్షన్ల కింద పలుమార్లు దాడులకు పాల్పడిన సర్పంచ్ బరిగెల బాబు అతని కుటుంబ సభ్యులపై కేసులు నమోదైనప్పటికిని గ్రామంలోని ఒకరిద్దరూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పెద్దమనుషులతో చేతులు కలిపి మాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ 60 సంవత్సరాలుగా ఎప్పుడు లేనిది కొత్తగా గొడవలు సృష్టిస్తూ మహిళలను ఉసిగొలుపుతూ అనుచరులతో దాడులు జయిస్తూ భౌతికంగా దెబ్బలు కొట్టిస్తూ చంపుతామని బెదిరిస్తూ ఈ రకంగా నన్ను నా పట్టా భూమిలో వ్యవసాయం చేసుకొనివ్వకుండా గ్రామంలో మాపై మా కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలకు పాల్పడుతూ వ్యవసాయ సాగు కొరకు వస్తున్న ట్రాక్టర్ యాజమాన్యాలను కూలీలను విపరీతంగా భయభ్రాంతులకు గురి చేస్తూ నన్ను నా కుటుంబీకులను వ్యవసాయం చేసుకొనివ్వకుండా అడ్డుపడుతుండటమే కాకుండా ఆటంకాలు సృష్టిస్తూ భూతగాదాలు సృష్టిస్తూ మమ్మల్ని ఎంతగానో వేదనకు గురి చేయుచున్నాడని తెలిపారు.సర్పంచ్ బరిగెల బాబు నుండి నాకు నా కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని తెలుపుతూనే ఏదైనా భూ సమస్య ఉంటే ఆధారాలు చూపించుకొని న్యాయపరమైన హక్కులను పొందుకోవాలి కానీ,రెవెన్యూ పరమైన హక్కులు పొందుకోవాలి కానీ ఎలాంటి భూ కాగితాలు లేకుండా 60 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా, వ్యవసాయం చేసుకుంటున్న మాపై మా కుటుంబ సభ్యులపై దాడుల పరంపరను కొనసాగిస్తున్న ఒరిగెల బాబు ఆగడాలను నియంత్రించడం కొరకు జిల్లా కలెక్టర్,జిల్లా పోలీస్ అధికారులు డిస్టిక్ పంచాయతీరాజ్ సెక్రెటరీ,పైన తెలిపిన విషయాన్ని సారంగా పోలీస్ అధికారులు కేసులు కట్టిన విధానాన్ని పరిగణలోనికి తీసుకొని పూర్తి సమగ్ర విచారణ జరిపి సర్పంచ్ బాబు పై కఠినమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రభుత్వ అధికారులను కోరారు. పట్ట భూమిభూమిలో జరుగుతున్న దౌర్జన్యాలపై ప్రత్యేక స్టోరీ క్రైమ్ బ్యూరో కాందారి అనిల్.

**నా ఇష్టం ఏమైనా చేస్తా(సర్పంచ్).....త్వరలో...**

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

**రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం**
**రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**




**కరీంనగర్,జూన్17(జై భీమ్ న్యూస్):**

ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చున్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

# కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ సురేష్‌లాల్ పుస్తకం

**'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' ఢిల్లీలో ఆవిష్కరణ**




**హనుమకొండ,జూన్17(జై భీమ్ న్యూస్):**

కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ రచించిన 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' పుస్తకాన్ని బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఆచార్య ఎస్.మహేంద్రదేవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేంద్ర దేవ్ మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణలులేని సమాజ నిర్మాణానికి ఈ పుస్తకం దార్శనికతతో కూడిన ఆచరణాత్మక మార్గదర్శకాన్ని అందిస్తుందని తెలిపారు. పుస్తక రచయిత సురేష్‌లాల్ మాట్లాడుతూ సున్నా పేదరికం, నిరుద్యోగం, అసమానత, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణ అనే ఐదు ప్రధాన లక్ష్యాల ఆధారంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి, ప్రపంచ శాంతి సాధనకు అవసరమైన విధానాలను ఈ గ్రంథంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. కేస్ స్టడీలు, నిపుణుల విశ్లేషణలు, కార్యాచరణ వ్యూహాల ద్వారా ఈ లక్ష్యాల పరస్పర అనుసంధానాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ చేతన్ గాటే, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.డి.ఎన్. భాజ్‌పాయ్, జనరల్ సెక్రటరీ రవీంద్ర బర్మే, ప్రముఖ ఆర్థికవేత్త అశ్విని మహాజన్ పాల్గొని సురేష్‌లాల్‌ను అభినందించారు.

# మున్నేరువాగుపై ప్రాజెక్ట్ నిర్మాణం

**సర్వే పనులను అడ్డుకున్న గిరిజనులు**

మహబూబాబాద్ ,జూన్17(జై భీమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గార్ల మండలం దుబ్బగూడెం సమీపంలో మున్నేరు వాగు పై ప్రభుత్వం నిర్మించనున్న పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్ట్ సర్వే పనులను గిరిజనులు అడ్డుకున్నారు. తమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చే పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు ఒప్పుకునేది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుద్దారం గిరిజనులు రోడ్డు పై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చావనైనా చస్తాము తప్ప మా భూములను వదులుకోబోమని హెచ్చరించారు. పోలీసులు ఆందోళన కారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఆల్ఫా ట్రైలర్ విడుదల

యష్ రాజ్ ఫిల్మ్స్ ప్రతిష్ఠాత్మక స్పై యూనివర్స్ నుంచి వస్తున్న మోస్ట్ అవేటెడ్ చిత్రం 'ఆల్ఫా' అధికారిక ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఆలియా భట్, శర్వరీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు శివ్ రావైల్ దర్శకత్వం వహించారు. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఆల్ఫా' చిత్రం వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో వస్తున్న మొట్టమొదటి మహిళా ప్రధాన స్పై యాక్షన్ థ్రిల్లర్ కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌లో భారతదేశపు తదుపరి తరం సైనికులను తయారు చేసే రహస్య ప్రోగ్రామ్ 'ఆల్ఫా' చుట్టూ కథ తిరుగుతున్నట్లు చూపించారు. 'గొర్రెలా కాదు? తోడేలులా జీవించాలి' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది. ఇక ట్రైలర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని యాక్షన్ అవతార్‌లో కనిపించారు. శర్వరీతో కలిసి భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, గూఢచర్యం, హెవీ కాంబాట్ ట్రైనింగ్ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. 'ది రైల్వే మెన్' ఫేమ్ శివ్ రావైల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఆదిత్య చోప్రా నిర్మాణంలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# పెద్ది నుంచి చికిరి చికిరి ఫుల్ సాంగ్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'పెద్ది' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'చికిరి చికిరి' అనే పాటకి సంబంధించిన ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో రామ్ చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్, జాన్వీ గ్లామర్, మాస్ కొరియోగ్రఫీ హైలైట్‌గా నిలిచాయి. చరణ్ రగ్డ్ లుక్‌లో, ఊర మాస్ స్టెప్పులతో ఇరగదీయగా, జాన్వీ కపూర్ ట్రెడిషనల్ అవుట్‌ఫిట్‌లో కుర్రకారు మతులు పోగొడుతోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించాడు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి.

# మా ఇంటి బంగారంలో సమంత పవర్‌ఫుల్ రోల్

టాలీవుడ్ నటి సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ యాక్షన్ డ్రామా, రిలీజ్‌కు ముందే పెట్టిన పెట్టుబడిని పూర్తిగా రికవరీ చేసుకొని లాభాల బాట పట్టింది. ఈ విషయాన్ని 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై చిత్ర నిర్మాత హిమాంక్ దువ్వూరు అధికారికంగా ప్రకటించారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమాను రూ. 25 కోట్ల నుంచి రూ. 30 కోట్ల మధ్య బడ్జెట్‌తో నిర్మించారు. అయితే థియేట్రికల్, నాన్-థియేట్రికల్ (ఓటీటీ, శాటిలైట్) హక్కులకు మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడటంతో, అన్ని డీల్స్ రిలీజ్ వారంలోనే విజయవంతంగా క్లోజ్ అయినట్లు తెలుస్తుంది. ఫలితంగా సినిమా విడుదలకు ముందే సేఫ్ జోన్‌లోకి వచ్చేసింది. ప్రస్తుత మార్కెట్‌లో ఒక మహిళా ప్రధాన తెలుగు చిత్రానికి ఇంతటి క్రేజ్ రావడం బలమైన కమర్షియల్ సిగ్నల్ అని చిత్ర బృందం పేర్కొంది. ఈ సందర్భంగా నిర్మాత హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ సినిమా స్క్రీన్‌పైకి రాకముందే పూర్తి పెట్టుబడిని రికవర్ చేయడం 'మా ఇంటి బంగారం'పై మార్కెట్‌కు ఉన్న నమ్మకానికి నిదర్శనం. సమంత పవర్‌ఫుల్ ప్రెజెన్స్, మా కథపై మేం పెట్టుకున్న నమ్మకం ఈ రోజు కమర్షియల్‌గా రిఫ్లెక్ట్ అవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దర్శకురాలు నందిని రెడ్డి మాట్లాడుతూ సమంతతో 'జబర్దస్త్', 'ఓ బేబీ' తర్వాత నాకు ఇది మూడో సినిమా. నాపై నమ్మకంతో తనే ఈ ప్రాజెక్ట్‌ను నా దగ్గరకు తీసుకువచ్చింది. జూన్ 19న థియేటర్లలో మీరు సమంతను పది రెట్లు ఎక్కువ పవర్‌ఫుల్‌గా చూస్తారు. ఇది నా ప్రామిస్ అంటూ చెప్పుకొచ్చింది. 2023లో వచ్చిన 'ఖుషి' చిత్రం తర్వాత సమంత పూర్తిస్థాయిలో వెండితెరపై కనిపించనున్న చిత్రమిదే. 2024లో వరుణ్ ధావన్‌తో కలిసి 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌లో మెరిసిన ఆమె, 2025లో తన సొంత నిర్మాణంలో వచ్చిన 'శుభం' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించారు. మళ్లీ మూడేళ్ల తర్వాత థియేటర్లలో ఆమె నటిస్తున్న లీడ్ రోల్ మూవీ కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇదిలావుంటే సమంత ప్రస్తుతం గర్భవతి అన్న వార్త ఇప్పుడు అభిమానుల్లో ఆనందం నింపుతోంది. అయితే దీనిపై అటువైపు నుంచి స్పష్టత రావాల్సి ఉంది.




# హసన్‌పర్తి శిక్షణ కేంద్రంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహణ కమిటీ సమావేశం




### గ్రామీణాభివృద్ధి శిక్షణలకు ప్రాధాన్యం - వార్షిక శిక్షణ ప్రణాళికకు ఆమోదం

**హనుమకొండ, జూన్ 18 (జై భీమ్ ప్రతినిధి)**

హసన్‌పర్తి విస్తరణ శిక్షణ కేంద్రంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహణ కమిటీ సమావేశం సంస్థ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 16 జిల్లాల ముఖ్య కార్యనిర్వాహణ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు హాజరై గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీల బలోపేతం, స్థానిక సంస్థల సామర్థ్య పెంపు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి అందించాల్సిన శిక్షణా కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ఆర్థిక వనరుల సమర్థ వినియోగం, పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సేవల వినియోగం, సామాజిక బాధ్యత, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలను శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా చేర్చాలని సభ్యులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా రూపొందించిన వార్షిక శిక్షణ ప్రణాళికకు నిర్వహణ కమిటీ ఆమోదం తెలిపింది. శిక్షణా కార్యక్రమాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. హసన్‌పర్తి శిక్షణ కేంద్రంలోని పాత పరిపాలనా భవనానికి మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు నిర్వహణ కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే సంస్థ కార్యకలాపాలను వేగవంతంగా నిర్వహించేందుకు హైబ్రిడ్ నాలుగు చక్రాల వాహనాల కొనుగోలుకు కూడా అనుమతి మంజూరు చేసింది. గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో శిక్షణా సంస్థల పాత్ర అత్యంత కీలకమని సమావేశ అధ్యక్షులు పేర్కొన్నారు. నాణ్యమైన శిక్షణల ద్వారా ప్రజాప్రతినిధులు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించి గ్రామాల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది, జిల్లా స్థాయి అధికారులు మరియు ఇతర ఆహ్వానితులు పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఉపయోగపడనున్నాయని అధికారులు తెలిపారు.



# లాయర్ పాత్రలో కీర్తి సురేశ్

### జులై 24న విడుదల కానున్న సత్తియవాన్ సావిత్రి

ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో, కథానాయిక కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కోర్టు రూమ్ డ్రామా చిత్రం 'సత్తియవాన్ సావిత్రి' విడుదల తేదీ ఖరారైంది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ విషయాన్ని కీర్తి తన ఇన్‌స్టా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా పంచుకున్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఇందులో కీర్తి సురేశ్ న్యాయవాదిగా ప్రత్యర్థిని సవాల్ చేస్తున్నట్లు కన్పించింది. ఈ పోస్టర్‌పై అభిమానులు స్పందిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మరో పవర్‌ఫుల్ పాత్రలో కీర్తిని చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామంటూ కామెంట్లు పెట్టారు. ఈ చిత్రం గురించి దర్శకుడు ప్రవీణ్ ఎస్ విజయ్ ఇటీవల మాట్లాడుతూ.. 'న్యాయానికీ, చట్టానికీ మధ్య తేడా ఉంటుంది. తన భర్త కేసులో భాగమైన సావిత్రి అనే న్యాయవాది కథే ఈ చిత్రం. ఆమె న్యాయం కోసం పోరాడుతుంటే, ఆమె సీనియర్‌కు మాత్రం చట్టమే ముఖ్యం. పరిస్థితుల కారణంగా ఆమె తన సీనియర్‌తోనే తలపడాల్సి వస్తుంది' అని తెలిపారు. 'హార్ట్ బీట్' ఫేమ్ చారుకేశ్ ఇందులో కీర్తి భర్తగా నటిస్తున్నారు. ఇక కీర్తి తదుపరి ఓ భారీ బ్జడెట్ రొమాంటిక్ థ్రిల్లర్ కోసం ప్రముఖ దర్శకుడితో చర్చలు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ భారీస్థాయిలో రూపొందనుందని, ఇప్పటివరకు చేయని జోనర్‌లో ఆమె కనిపించనున్నారని టాక్. అటు కీర్తి, రాజ్‌కుమార్ రావ్ జంటగా నటించిన 'రఫ్తార్' చిత్రం కూడా విడుదల కానుంది.